

# ప్రజాజ్యోతి

## భద్రాద్రి కొత్తగూడెం

సోమవారం | 27 | మే | 2024 | పేజీలు : 5


## ఎమ్మెల్సీ ఉప ఎన్నిక డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్ ప్రియాంక అల

భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో, మే 26, ప్రజాజ్యోతి

వరంగల్ - ఖమ్మం - నల్గొండ శాసనమండలి పట్టభద్రుల ఉప ఎన్నికకు సంబంధించి కొత్తగూడెం శ్రీ రామచంద్ర డిగ్రీ కాలేజీలో ఏర్పాటు చేసిన పంపిణీ కేంద్రం (డిస్ట్రిబ్యూషన్ సెంటర్)ను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అల ఆదివారం పరిశీలించారు. పోలింగ్ సామాగ్రి పంపిణీ ప్రక్రియను మరియు పంపిణీ

మిగతా 2 లో..





2 లో

# ఆపదలో... ఆడపిల్లలు..?

- బీఎస్సీ నర్సింగ్ విద్యార్థికి న్యాయం జరిగేనా.!
- విద్యార్థి ప్రాణం ఖరీదు 25 లక్షలటా.!
- న్యాయం జరగకపోతే విద్యార్థినుల భవిష్యత్తు అంధకారమే..
- కాలేజ్ సీజ్ చేయాలంటున్న విద్యార్థి సంఘాలు..
- న్యాయం జరగకపోతే ప్రజా కోర్టులో శిక్ష తప్పదు మావోయిస్టు నేత ఆజాద్..

భద్రాచలం, ప్రజాజ్యోతి

హాస్టల్ విద్యార్థినులకు ఆపద పొంచి ఉంది. చిన్నారులు, బాలికలు, యువతులు ఎవరికీ రక్షణ లేకుండా పోతుంది. ఎన్ని కఠిన చట్టాలు ఉన్న లైంగిక వేధింపులు, అత్యాచారాలు, దాడులు ఆగడం లేదు. నిత్యం ఏదో ఒకచోట ఇలాంటి ఘటనలు చోటు చేసుకోవడం ఆందోళన కలిగిస్తున్న అంశాలు. బయటికి వస్తున్న ఈ ఘటనలు కొన్నే ఉండగా రానివి మరెన్నో ఉంటున్నాయి. విషయం తెలిస్తే పరువు పోతుందనే ఉద్దేశంతో లోలోపలే మదన పడుతున్న అభాగ్యులు ఎందరో ఉన్నారు. దారుణాలు జరిగిన రెండు మూడు రోజులు కాలయాపన చేసి బాధితుల కుటుంబాలకు డబ్బు ఎర చూపుతో మాన, ప్రాణాలకు వెలకడుతున్న దౌర్భాగ్యులకు శిక్షలు ఎవరు వేయాలి..? అఘాయిత్యాలు జరిగినప్పుడు వెంటనే కఠిన చర్యలు తీసుకోకుండా ఏళ్ల తరబడి నాన్చడం వల్లే ఇలాంటి ఘటనలు పునరావృతం అవుతున్నాయనే అభిప్రాయాలు ప్రజల్లో వ్యక్తం అవుతున్నాయి.

## పట్టభద్రుడా... నీ విలువ కాపాడుకో..!



### నేడే ఎమ్మెల్సీ ఉప ఎన్నిక

- నోటుకు నీ ఓటు అమ్ముకోకు..?
- సామాన్యులకు, పట్టభద్రులకు తేడా ఎక్కడ...!
- రూ. 500 లకు ఓటు విక్రయిస్తున్న ఓ పార్టీ...?
- పట్టభద్రుల పక్షాన నిలిచే వారికే ఓటు వేస్తేనే మేలు
- డబ్బులకు ఓటును కొని ఏమి న్యాయం చేస్తారూ.?
- గ్రామీణ ప్రాంతాల్లో రూ. 300..?
- తగ్గుతున్న పట్టభద్రునీ విలువ
- కాపాడుకోకపోతే భవిష్యత్ ప్రశ్నార్థకమే...!

2 లో



## గంజాయి అక్రమ రవాణాపై...
# పోలీసుల ఉక్కుపాదం

- 2 కోట్ల 58 లక్షల విలువ చేసే 1035 కేజీల గంజాయిని స్వాధీనం..
- జిల్లా వ్యాప్తంగా నిషేధిత గంజాయి పై విస్తృత తనిఖీలు
- గంజాయి రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవు
- జిల్లా ఎస్పీ రోహిత్ రాజు








2లో

## ఎమ్మెల్సీ ఉప ఎన్నిక డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్ ప్రియాంక అల

(మొదటి పేజీ తరువాయి)

కేంద్రంలో ఏర్పాటులను పరిశీలించిన అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా సిబ్బందికి పోలింగ్ సామాగ్రి పక్కగా అందించాలని, చెక్ లిస్ట్ ఆధారంగా ఎన్నికల నిర్వహణకు అవసరమైన సామాగ్రి అందినదా లేదా అన్నది సరిచూసుకోవాలని తెలిపారు. పోలింగ్ విధులను సమర్ధవంతంగా నిర్వహించాలని తెలిపారు. పోలింగ్ సిబ్బంది, పరికరాలు పోలింగ్ కేంద్రాల వద్దకు తరలించేందుకు సిద్ధంగా ఉంచిన వాహనాలను, వాటికి అమర్చిన ట్రాకింగ్ పరికరాలను పరిశీలించి, సకాలంలో నిర్దేశిత పోలింగ్ కేంద్రాల వద్దకు సిబ్బందిని చేరుకునేలాగా పర్యవేక్షణ జరపాలని అధికారులను ఆదేశించారు. వర్ష సూచనలు ఉన్నందున ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించాడు. బ్యాలెట్ పెట్టెలా రవాణాకు పటిష్టమైన భద్రత కల్పించాలని తెలిపారు. రేపు పోలింగ్ అనంతరం రిసెప్షన్ సెంటర్ కూడా ఇక్కడే ఉంటుందని కలెక్టర్ తెలిపారు. సోమవారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహించే పోలింగ్ కు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని ఓటర్లు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. జిల్లాలో ఇప్పటివరకు పోస్టల్ బ్యాలెట్ ద్వారా 252 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని, సోమవారం జరిగే శాసనమండలి ఉప ఎన్నిక పోలింగ్ లో 100% ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించు కోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వేణుగోపాల, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కాశయ్య,కొత్తగూడెం ఆర్ డి ఓ మధు, భద్రాచలం ఆర్డీవో దామోదర్ రావు, కొత్తగూడెం తాసిల్దార్, పుల్లయ్య, డిప్యూటీ తహసిల్దార్, అంజద్ పాషా,ఎలక్షన్ సెల్ సూపర్డెంట్ ధారా ప్రసాద్, రంగా ప్రసాద్, ఎన్ ఐ సి, సుశీల్, నవీన్, తదితరులు పాల్గొన్నారు.

## పట్టభద్రుడా....!
## నీ విలువ కాపాడుకో...!

**ఇల్లందు, మే 26, ప్రజాజ్యోతి:**



సాధారణంగా ఎలాంటి ఎన్నికలైన ఆయా రాజకీయ పార్టీలు వారి అభ్యర్థి గెలుపు కోసం ఓటర్లకు డబ్బులు ఇవ్వడం సర్వ సాధారణం. మరికొంతమంది ఓటరు వేరే ప్రాంతాల్లో ఉంటే ఓటు కోసం రవాణా ఖర్చులు సైతం ఇస్తామని మీరు వచ్చింది ఓటు వేయాలని కోరడం మనం వింటూనే ఉంటాం. అంతేకాకుండా ఓటరు తమ అమూల్యమైన ఓటును డబ్బులతో అమ్ముకోవద్దని పదే పదే చెబుతున్నప్పటికి రాజకీయ పార్టీలు మాత్రం ఓటర్లకు ఓటుకు రేటు కట్టి మరి డబ్బులు ఇవ్వడం జరుగుతుంది. సామాన్యులు తమ ఓటును అమ్ముకొవడం జరుగుతుంటే, ఉన్నత చదువులు చదివిన పట్టభద్రులకు కూడా రాజకీయ పార్టీలు శాసన మండలి ఎన్నికల్లో నోటుతో ఓటును విక్రయించడం ఏమిటో అర్థం కానీ పరిస్థితి. దింతో పట్టభద్రుడా... ఓటుకు నోటు తీసుకోని నీ విలువను తగ్గించుకోవద్దని పలువురు సూచిస్తున్నారు. ఎలా రాజకీయ పార్టీలు పట్టభద్రుల ఓట్లను సైతం రేటు పెట్టి కొనుగోలు చేయడంపై పలు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఖమ్మం – వరంగల్ –నల్గొండ పట్టభద్రుల శాసన మండలి ఉప ఎన్నికల్లో ఓ రాజకీయ పార్టీ ఏకంగా వారి అభ్యర్థికి ఓటు వేయాలని ఏకంగా పట్టణ ప్రాంత ఓటర్లకు రూ. 500 ముట్టజెప్పినట్లు పక్కా సమాచారం. పట్టణం, గ్రామీణ ప్రాంతానికి తేడా చూపుతూ రూ. 500, రూ. 300లను ఇంటింటికి తిరుగుతూ ఇస్తున్నట్లు తెలుస్తుంది. కానీ డబ్బులు తీసుకున్నంత మాత్రాన వారి పార్టీ అభ్యర్థికి ఓటు వేస్తారనే నమ్మకం లేదు. రాజకీయ పార్టీలు మాత్రం తమ పార్టీ అభ్యర్థికే ఓటు వేస్తారనే ధీమాలో ఉన్నట్టు తెలుస్తుంది. ఇలా రాజకీయ పార్టీలు డబ్బులకు ఓట్లను కొనుగోలు చేయడం ఏమిటనే విమర్శలు వస్తున్నాయి. గతంలో పట్టభద్రుల ఓట్లతో గెలిచిన వారు తమ కోసం ఏమైనా కృషి చేశారా, లేక కేవలం పదవి కోసమే పోటీ చేస్తున్నారా అనేది స్పష్టత కానీ పరిస్థితి. ఇలా ఓట్లతో గెలిచి వారికీ న్యాయం చేయకపోవడం ఏమిటని పలువురు పట్టభద్రులు ప్రశ్నిస్తున్నారు. రాజకీయ పార్టీల అభ్యర్థుల వద్ద నుంచి డబ్బులు తీసుకోని ఓట్లు వేస్తే వారికీ ఎలాంటి న్యాయం చేస్తారా అనే అనుమానాలు వస్తున్నాయి. దింతో పట్టభద్రుల విలువ సైతం తగ్గిపోతుందనేది రాజకీయ విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఓట్లను రాజకీయ పార్టీలకు అమ్ముకుంటే రానున్న రోజుల్లో వారి భవిష్యత్ ప్రశ్నార్థకం కావడం మాత్రం వాస్తవం. మరి పట్టభద్రులు శాసన మండలి ఎన్నికల్లో ఎలాంటి నిర్ణయం తీసుకోని ఏ పార్టీకి పట్టం కట్టి ఎవరికీ అండగా నిలుస్తారో తెలియాలంటే మరి కొన్ని రోజులు వేచి ఉండాల్సిందే.

# ఆపదలో ఆడపిల్లలు..!?

**భద్రాచలం, మే 26, ప్రజాజ్యోతి**



వివరాల్లోకి వెళితే ఈ నెల 23 గురువారం భద్రాచలం మారుతి నర్సింగ్ కాలేజ్ విద్యార్థి కారుణ్య అనుమానాస్పద మరణం రాష్ట్రవ్యాప్తంగా సంచలనంగా మారింది. దళిత విద్యార్థి మరణానికి కారకులైన వ్యక్తులను వెంటనే శిక్షించాలని విద్యార్థి సంఘాలు నిరసన కార్యక్రమాలు చేపట్టాయి. తన మరణానికి కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని ప్రజాప్రతినిధులు ఊకదంపుడు ఉపన్యాసాలు ఇచ్చారు. కానీ చివరకు కాలేజీ యాజమాన్యం ప్రాణానికి వెలకట్టి చేతులు దులుపుకుంది. అయితే కాలేజీలో జరుగుతున్న దారుణాలు ముమ్ముందు ఇలాగే కొనసాగితే దానికి బాధ్యులు ఎవరన్నా విషయం ప్రజల్లో తలెత్తుతుంది. గతంలో కూడా ఇదే కాలేజీలో అనేకమంది విద్యార్థుల పై అఘాయిత్యాలు జరిగాయనే ఆరోపణలు సైతం వ్యక్తమవుతున్నాయి. విద్యార్థుల మానప్రాణాలకు రక్షణ లేదని, నిత్యం దాడులు మానసిక వేధింపులకు విద్యార్థులు గురవుతున్నారని తల్లిదండ్రులు లోపల మదన పడుతున్నారు. ఇటువంటి తరుణంలో ఈ కేసులో నిజ నిజాలు నిగ్గు తెల్చి న్యాయం జరగకపోతే న్యాయ వ్యవస్థకే మాయని మచ్చగా మారుతుంది. అంతేకాక హాస్టల్లో చదువుకునే ఆడపిల్లల మనసుల్లో చట్టాలపై నమ్మకం సల్లడిల్లి పోతుంది.




### న్యాయం జరగకపోతే ప్రజా కోర్టులో శిక్ష తప్పదు..

నర్సింగ్ విద్యార్థి పగిడిపల్లి కారుణ్య మృతికి పూర్తి బాధ్యత డాక్టర్ ఎస్ ఎల్ కాంతారావు దే నని అసలు ఏమి జరిగిందన్న విషయాన్ని గోప్యంగా ఉంచి ఆడపిల్ల ప్రాణం తీసినందుకు మారుతి నర్సింగ్ కాలేజ్ బాధ్యత వహించాలని భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) భద్రాద్రి కొత్తగూడెం అల్లూరి సీతారామరాజు డివిజన్ కమిటీ అగ్రనేత ఆజాద్ ఆదివారం ప్రకటన విడుదల చేశారు. కారుణ్య మృతితో పాటు ఇదే కాలేజీలో విద్యనభ్యసిస్తూ గతంలో మృతి చెందిన విద్యార్థినుల మరణాల పట్ల విచారణ జరిపించాలని ప్రకటనలో పేర్కొన్నారు. అధిక ఫీజులు వసూలు చేస్తూ పేదల రక్తం తాగుతున్న నర్సింగ్ కాలేజ్ పై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నర్సింగ్ కాలేజ్ యాజమాన్యం పేదల జీవితాలతో ఆడుకుంటే ప్రజాగ్రహానికి గురికాక తప్పదని, అదే విధంగా కారుణ్య మరణం విషయంలో న్యాయం జరగకపోతే ప్రజా కోర్టులో శిక్ష తప్పదని హెచ్చరించారు.

# గంజాయి అక్రమ రవాణాపై పోలీసుల ఉక్కుపాదం





**భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో, మే 26, ప్రజాజ్యోతి**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వ్యాప్తంగా పోలీసులు నిషేధిత గంజాయి పై విస్తృత తనిఖీలు చేపట్టారు. గంజాయి అక్రమ రవాణాను నిరోధించేందుకు జిల్లా సరిహద్దుల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి రవాణాకు పాల్పడు తున్న వ్యక్తులపై చట్ట ప్రకారం కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఆదివారం ఒక ప్రకటనను వెల్లడించారు. మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాలను నిర్మూలించడంలో భాగంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన (టీఎస్ ఎన్ఏబీ తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో) వారితో సమన్వయం పాటిస్తూ, సమాచారాన్ని సేకరిస్తూ నిషేధిత గంజాయి రవాణాను అడ్డుకోవడం జరుగుతుందని తెలియజేసారు. ఇందులో భాగంగా 25వ తేదీన జిల్లాలోని మూడు పోలీస్ స్టేషన్ల పరిధిలో గంజాయి రవాణా చేస్తున్న వారిని పట్టుకుని భారీగా గంజాయిని స్వాధీనం చేసుకోవడం జరిగింది. భద్రాచలం పోలీస్ స్టేషన్ పరిధిలోని కూనవరం రోడ్డులో ఆర్టిఏ ఆఫీస్ ఎదురుగా భద్రాచలం ఎస్సై విజయలక్ష్మి తన సిబ్బందితో కలిసి వాహన తనిఖీలు చేస్తుండగా రెండు వాహనాలలో తరలిస్తున్న 427 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకోవడం జరిగింది. దీని విలువ సుమారుగా రూ. 1,06,58,000/- ఉంటుంది. ఇట్టి గంజాయిని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, మోతుగూడెం, సుకుమామిడి నుండి 07గురు వ్యక్తులు రెండు వాహనాల్లో ప్లైఉడ్ షీట్స్ మాటున హైదరాబాద్ మూసాపేటకు తరలిస్తూ పోలీసులకు పట్టుబడ్డారు. అశ్వరావుపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని జంగారెడ్డిగూడెం రోడ్డులోని సాయిబాబా టెంపుల్ వద్ద ఎస్సై శ్రీనివాస్ తన సిబ్బందితో వాహన తనిఖీలు చేస్తుండగా ఒక బొలెరో వ్యాన్ లో నలుగురు వ్యక్తులు పనసకాయల లోడులా భావించే విధంగా వెనుక భాగంలో 359 కేజీల గంజాయిని దాచిపెట్టుకుని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం దారకొండ, అల్లూరి సీతారామరాజు జిల్లా నుండి హైదరాబాద్ నకు తరలిస్తుండగా పట్టుకోవడం జరిగింది. దీని విలువ సుమారుగా రూ. 89,83,000/- ఉంటుంది. అశ్వాపురం పోలీస్ స్టేషన్ పరిధిలోని వద్ద ఎస్సై తిరుపతి తన సిబ్బందితో కలిసి వాహన తనిఖీలు చేస్తుండగా ముగ్గురు వ్యక్తులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, అల్లూరి సీతారామరాజు జిల్లా, చింతూరు నుండి ప్రత్యేకంగా ఒక ప్రైవేట్ బస్సులో వెనుక లగేజీ క్యాబిన్ లోపల భాగంలో కట్ చేసి,బస్సు లోపల సీట్ల క్రింద భాగాన్ని అరల వలే కట్ చేసి 249 కేజిల గంజాయిని అమర్చి హైదరాబాద్ నకు తరలిస్తుండగా అశ్వాపురం పోలీసులు పట్టుకోవడం జరిగింది. దీని విలువ సుమారుగా రూ. 62,07,500/-ఉంటుంది. ఇట్టి మూడు ఘటనలలో సుమారుగా రూ. 2,58,48,500/-(రెండు కోట్ల యాభై ఎనిమిది లక్షల నలభై ఎనిమిది వేల ఐదు వందలు) విలువ గల 1035 కేజిల నిషేధిత గంజాయిని స్వాదీనం చేసుకుని రవాణాకు ఉపయోగించిన వాహనాలను సీజ్ చేసి అట్టి వ్యక్తులను అరెస్టు చేసి జైలుకు పంపించడం జరిగింది.

# మావోయిస్టుల ఆటవిక చర్యల వల్ల తీవ్రంగా నష్టపోతున్న ప్రజలు

- బూబీట్రాప్స్ వలన మూగ జీవాలు మరణిస్తున్నాయి
- ఆదివాసి ప్రజల ఆస్తులకు ప్రాణాలకు తీవ్ర నష్టం జరుగుతుంది
- మావోయిస్టు లొంగిపోయి సాధారణ జీవితం గడపాలి
- జిల్లా ఎస్పీ రోహిత్ రాజు





**భద్రాచలం, మే 26, ప్రజాజ్యోతి**

తెలంగాణ – ఛత్తీస్గఢ్ సరిహద్దు గ్రామమైన భీమారం సమీప అటవీ ప్రాంతంలో నిషేధిత మావోయిస్టు పార్టీకి చెందిన మిలీషియా అమర్చిన బూబిట్రాప్స్ వలన ఇద్దరు అదీవాసి మహిళల రెండు కాళ్ళకు తీవ్ర గాయ్యాలయ్యాయి. ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారు చివరకు బ్రతికి బయటపడినారు. నిషేధ సిపిఐ మావోయిస్టు పార్టీ మిలీషియా చేస్తున్న ఆటవిక చర్యల వలన అమాయకపు ఆదివాసి ప్రజల ఆస్తులకు, ప్రాణాలకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని ఈ రోజు జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఒక ప్రకటనలో వెల్లడించారు. ఇటీవల కాలంలో పూసుగుప్ప అటవీ ప్రాంతంలో నిషేధిత మావోయిస్టులు అమర్చిన బూబీ ట్రాప్స్ వలన సామాన్య ఆదివాసీ ప్రజలకు చెందిన మూడు ఆవులు, రెండు కుక్కలు మరణించడం జరిగిందన్నారు. నిషేధిత సిపిఐ మావోయిస్టులు దురాలోచనలతో ఏర్పాటు చేస్తున్న బూబీట్రాప్స్, ఐఈడీ ల వలన ఆయా అటవీ ప్రాంతాల్లో నివసించే ఆదివాసీలు భయభ్రాంతులకు గురౌతున్నారు.
అదేవిధంగా పూసగుప్ప, ఉంజుపల్లి గ్రామాల మధ్య శనివారం (25.05.2024) నాడు రహదారికి అడ్డంగా చెట్లను నరికి పడేసి ఆదివాసి ప్రజల రాకపోకలకు అంతరాయం కలిగించారు. ఒకవైపు ప్రభుత్వాలు ఆదివాసి ప్రజలకు విద్య, వైద్యం, రవాణా వంటి అన్ని రకాల సౌకర్యాలను ఏర్పాటు చేస్తూ వారిని అభివృద్ధి చేస్తుంటే, మరో వైపు మావోయిస్టులు మిలీషియా చేత దుశ్చర్యలకు పాల్పడుతూ ఆదీవాసీ ప్రజలను ఆటవిక జీవితానికే పరిమితం చేస్తున్నారు. ఇలాంటి చర్యలకు వలన మావోయిస్టుల ఆలోచనా సరళి పురోగమిస్తుందా?.. తిరోగామిస్తున్నదా?.. ఆలోచించుకోవాల్సిన అవసరం మావోయిస్టులకు ఎంతైనా ఉంది. మావోయిస్టు పార్టీకి చెందిన మిలీషియా వలన ఆదీవాసి ప్రజలకు నష్టమే తప్ప ఎలాంటి లాభం లేదని ప్రజలు గ్రహించాలి. నిషేధిత మావోయిస్టు పార్టీ మిలీషియా వలన సామాన్య ప్రజలకు కలుగుతున్న ఇబ్బందులకు మావోయిస్టు పార్టీ నాయకులు ప్రజలకు సమాధానం చెప్పాల్సిన అవసరం ఉంది. ఇప్పటికైనా తమ ప్రాంత అభివృద్ధి కోసం, తమ భవిష్యత్ కోసం ఇలాంటి పద్ధతులను మానుకొని మావోయిస్టు పార్టీని వీడి పోలీసుల ఎదుట లొంగిపోయి సాధారణ జీవితం గడపాలని కోరారు.
జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో చేపట్టిన ఆపరేషన్ చేయూత కార్యక్రమానికి ఆకర్షితులై ఈ సంవత్సరం జనవరి నెల నుండి ఇప్పటివరకు 15 మంది మావోయిస్టులు లొంగిపోవడం జరిగింది. ఇందులో నిషేధిత సిపిఐ మావోయిస్టు పార్టీకి చెందిన ఇద్దరు డిప్యూటీ కమాండర్లు, ముగ్గురు ఏరియా కమిటీ సభ్యులు, 5గురు దళసభ్యులు, 5గురు మిలీషియా సభ్యులు లొంగిపోవడం జరిగింది. వారికి ప్రభుత్వం తరపున అందాల్సిన అన్ని రకాల ప్రతిఫలాలను అందించడం జరుగుతుందని పేర్కొన్నారు.

# ఉచిత వైద్య శిబిరానికి స్పందన

- శిబిరాన్ని సద్వినియోగం చేసుకున్న ప్రజలు
- గ్రామీణ వైద్యులు అఖిల్ అహ్మద్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం



**ఇల్లందు, మే 26, ప్రజాజ్యోతి:**

ఉచిత వైద్య శిబిరానికి జనం భారీగా తరలివచ్చారు. ఆదివారం మండల పరిధిలోని పోచారం గ్రామపంచాయతీ లో స్థానిక గ్రామీణ వైద్యులు అఖిల్ అహ్మద్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఖమ్మం, హైదరాబాద్ లకు చెందిన స్పెషలిస్ట్ డాక్టర్లు ఫయాజ్ షేక్ , సుబుర్ షాహిరోజ్, మహమ్మద్ షోయబ్ ఖాన్, శ్రావణ్ రెడ్డి, భాను చంద్రలు రోగులను పరీక్షించారు. కిడ్నీ, టీబీ, ట్రాన్స్ ప్లాంటేషన్, జనరల్ మెడిసిన్, పిల్లల వైద్య నిపుణులకు చెందిన ఆయా డాక్టర్లు శిబిరానికి వచ్చిన రోగులను పరీక్షించి ఉచితంగా మందులు మాత్రలు పంపిణీ చేశారు. ఉచితంగా నిర్వహిస్తున్నవైద్య శిబిరానికి పోచారం గ్రామపంచాయతీ నుండి కాకుండా పరిసర గ్రామ పంచాయతీల నుండి రోగులు భారీ సంఖ్యలో తరలివచ్చి చికిత్సలు తీసుకున్నారు. మెరుగైన వైద్య చికిత్స కోసం సూచనలు, సలహాలు చేశారు. చికిత్స కోసం వచ్చిన రోగుల సందేహాలను నివృత్తి చేస్తూ ఆరోగ్య జాగ్రత్తలను తెలియజేశారు. అనంతరం ఉచితంగా మందులను పంపిణీ చేశారు. శిబిరానికి వచ్చిన రోగులతో ప్రాంగణమంతా నిండి పోయింది.

# పూర్వ విద్యార్థినుల ఆత్మీయ సమ్మేళనం



**కొత్తగూడెం, మే 26, ప్రజాజ్యోతి**

శ్రీ రామచంద్ర బాలికోన్నత పాఠశాల పూర్వ విద్యార్థినుల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమం ఆనందోత్సవాల మధ్య జరిగింది. ఆదివారం మున్సిపల్ పరిధిలోని పిఆర్ ఫంక్షన్ హాల్ లో పాఠశాలకుచెందిన 1998-99 బ్యాచ్ కు చెందినపదవతరగతి విద్యార్థినులు25 సంవత్సరాల గతస్మృతులను గుర్తుచేసుకుంటూ ఆనందోత్స వాలతో గడిపారు. వీరికీ విద్యాబుద్ధులు నేర్పిన టీచర్లకు సన్మానం చేసి తమ విధేయతను చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థినిలు హేమ, సవిత, సౌజన్య., షకీరా పాల్గొన్నారు.

# కారుణ్య మృతిపై సీబీఐతో విచారణ జరిపించాలి...

## మహాజన మహిళా సమైక్య ఎంఎంఎస్ డిమాండ్



**భద్రాచలం, మే 26, ప్రజాజ్యోతి**

స్థానిక ఆదర్శ నగర్ కాలనీ లో మహాజన మహిళా సమైక్య సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశం ఉద్దేశించి మహాజన మహిళా సమైక్య జిల్లా అధ్యక్షురాలు మేకల లత మహాజన్ మాట్లాడుతూ..... భద్రాచలం పట్టణంలోని ప్రైవేట్ మారుతి నర్సింగ్ కాలేజీ విద్యార్థిని పగిడిపల్లి కారుణ్య మృతికి వెలగట్టి తల్లిదండ్రులకు డబ్బు ఆశ చూపించి మారుతి నర్సింగ్ కళాశాల యాజమాన్యం తన కొడుకును కాపాడుకునేందుకు డబ్బుల సంచుల తో ప్రభుత్వ అధికారులను కొనేసి హత్యను ఆత్మహత్యగా చిత్రీకరిస్తున్నారని అనుమానం కలుగుతుందని అన్నారు. మారుతి కాలేజీ లో జరుగుతున్న వేధింపులు, అనుమానస్పద మరణాలపై సిబిఐతో విచారణ జరపాలని డిమాండ్ చేశారు. విద్యా వ్యాపారంతో పేద విద్యార్థులను మానసికంగా వేధిస్తూ సొమ్ము చేసుకుంటున్న మారుతి నర్సింగ్ కాలేజీ యాజమాన్యంపై ప్రభుత్వం చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కారుణ్య మృతితో పాటు మారుతి కాలేజీ చదువుకున్న విద్యార్థుల అనుమానస్పద మృతులపై సిబిఐ తో ఎంక్వయిరీ చేసి విద్యార్థిని కుటుంబాలకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కారుణ్య చనిపోయి రెండు రోజులవుతున్న మృతి కి గల కారణాలపై ఎటువంటి దర్యాప్తు చేయకపోవడం బాధాకరమని అన్నారు. ప్రభుత్వ అధికారులను తమ గుప్పెట్లో పెట్టుకొని కారుణ్య చావుకు కారణాలను బయటకు రాకుండా కప్పిపుచ్చారని ఆవేదన వ్యక్తపరిచారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి కారుణ్య మృతి కి గల కారణాలను సిబిఐతో పూర్తి ఎంక్వయిరీ చేసి మరే విద్యార్థిని చనిపోకుండా చూడాలని అన్నారు. కారుణ్య మృతి పై ఎంక్వైరీ చేయకుంటే మహాజన మహిళా సమితి ఆధ్వర్యంలో ప్రభుత్వానికి నిరసన సెగ తప్పదని హెచ్చరించారు. ఈ సమావేశం లో మహాజన మహిళా సమైక్య జిల్లా ఉపాధ్యక్షులు కొంచర్ల కుమారి, గడ్డల కృష్ణవేణి, కొప్పుల నాగమణి పాల్గొన్నారు.

# పెట్రోల్ కొట్టించుకునేటప్పుడు జీరో ను కచ్చితంగా గమనించాలి





**కొత్తగూడెం, మే 26, ప్రజాజ్యోతి**

వినియోగదారులు పెట్రోల్, డీజిల్ పోయించుకునేటపుడు తప్పనిసరిగా మీటర్ రీడింగ్ జీరో ఉన్నదా లేదా పరిశీలించాలని జిల్లా తూనికలు, కొలతల శాఖ అధికారి కె. మనోహర్ తెలిపారు. ఆదివారం కొత్తగూడెం పట్టణంలోని పోస్టాఫీస్ సెంటర్ లో గల శ్రీనివాస్ ఫిల్లింగ్ స్టేషన్ లో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనదారులు పెట్రోల్ లేదా డీజిల్ పోయించుకునేటప్పుడు మీటర్ జీరో ఉన్నదా లేదా అన్నది సమగ్రంగా పరిశీలన చేయాలని తెలిపారు. ఆదివారం ఒక వాహనదారుడికి రీడింగ్ జీరో చేయకుండా పెట్రోల్ పోసినందున తక్కువ వచ్చినట్లు ఫిర్యాదు వచ్చిందని, తనిఖీ చేసి పరిశీలించామని ఆయన పేర్కొన్నారు. తన పరిశీలనలో పెట్రోల్, డీజిల్ సక్రమంగానే జరుగుతున్నట్లు తేలిందని అన్నారు. కేవలం పెట్రోల్ పోసేటప్పుడు మీటర్ జీరో చేయకపోవడం వల్ల వినియోగదారునికి తక్కువ పెట్రోల్ వచ్చిందని, అందువల్ల కేసు నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

# ఖాజా గౌస్ మోహినుద్దీన్‌కు ఘన సన్మానం



**ఇల్లందు, మే 26, ప్రజాజ్యోతి:**

ఇల్లందు సీనియర్ కాంగ్రెస్, ఐఎన్టియుసి నేత ఖాజా గౌస్ మోహినుద్దీన్ ను పంజాబ్ రాష్ట్రంలోని ఆనంద్ పుర్సాహిబ్ పార్లమెంట్ ఎన్నికల కో – అబ్జర్వర్ గా నియమించినందుకు ఆదివారం వరంగల్ దర్గా గ్రీన్ స్టార్ యూత్ ఆధ్వర్యంలో శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. కాంగ్రెస్ పార్టీలో కష్టపడినా వారికీ తప్పనిసరిగా గుర్తింపు రావడం ఖాయమని పేర్కొన్నారు. పంజాబ్ రాష్ట్రంలోని ఆనంద్ పుర్సాహిబ్ పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గెలుపులో ఖాజా గౌస్ మోహినుద్దీన్ కీలక పాత్ర పోషించాలని ఆకాంక్షించారు. జహీర్ అహ్మద్, జహంగీర్, హామీ ద్ హుస్సేన్, సయ్యద్ అఫ్జల్, మహమ్మద్ ఇంతియాజ్, ముక్తార్ నవాబ్ గౌస్, షాకీర్, షోయబ్, హాజీ, అహ్మద్ జానీ, అమీర్ అహ్మద్, అభిద్ పాషా పాల్గొన్నారు.

# పోలింగ్ బూతులను పరిశీలించిన డిఎస్పి



**ఇల్లందు, మే 26, ప్రజాజ్యోతి:**

ఖమ్మం – వరంగల్ – నల్గొండ పట్టభద్రుల శాసన మం డలి ఉప ఎన్నికల నేపథ్యంలో ఆదివా రం డిఎస్పి ఎన్. చంద్రభాను పోలింగ్ బూతులను పరిశీలించారు. ఈ సందర్భంగా డిఎస్పి మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఉప ఎన్నికలలో భాగంగా ఇల్లందులోని సింగరేణి ఉన్నత పాఠశాల, బాలికల ఉన్నత పాఠశాల (గర్ల్స్ హై స్కూల్ ), టేకులపల్లి జూనియర్ కళాశాల, ఆళ్లపల్లి ప్రభుత్వ పాఠశాలలను పరిశీలించడం జరిగిందన్నారు. పోలింగ్ బూతుల వద్ద ఏర్పాట్లపై సంబంధిత అధికారులకు పలు సూచనలు చేయడం జరిగిందని పేర్కొన్నారు. ఇల్లందు, టేకులపల్లి, ఆళ్లపల్లి పరిధిలో 144 సెక్షన్ అమలులో ఉంటుందని, ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇల్లందు, టేకులపల్లి సిఐలు టి. కరుణాకర్, టి. సురేష్, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

# అక్రమ బదిలీలను నిలిపివేయాలి :ఏఐటీయూసీ




మణుగూరు, మే 26, ప్రజాజ్యోతి

మణుగూరు ఏరియాలో అక్రమ బదిలీలను నిలిపివేయాలని ఏఐటీయూసీ వైస్ ప్రెసిడెంట్ కామ్రేడ్ మల్లెల రామ నరసయ్య ప్రకటనలో తెలిపారు. ఆదివారం పీవీ కాలనీ కామ్రేడ్ మహేంద్ర భవన్ నందు ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ మణుగూరు ఏరియాలో పనిచేస్తున్న కార్మికులను యాజమాన్యం ఇష్టారీతిన బదిలీలు చేస్తూ కార్మికులను ఇబ్బందులకు గురి చేస్తుందని, దీనివలన కార్మికులు ఇబ్బందులకు గురి అవుతున్నారని అన్నారు. బదిలీలలో పారదర్శకత పాటించకుండా కేవలం కొందరికి ప్రయోజనం కల్పించడం కొరకే ఈ బదిలీలు చేస్తున్నారని అన్నారు. క్రమశిక్షణతో పనిచేస్తున్న కార్మికులకు ఇటువంటి బదిలీలు మనస్థాపాన్ని, ఆందోళనలు కలగజేస్తాయని అన్నారు. సెక్షన్లలో పనిచేస్తున్న వారికి వర్కింగ్ ప్లేస్లు మారుస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నారని అందరినీ ఒకేలా చూడాల్సిన యజమాన్యం పక్షపాతంగా చూడడం సరి కాదని అన్నారు. కార్మికుల బదిలీలకు అడ్డు రాణి ఎలక్షన్ కోడ్ వారి సమస్యల పరిష్కారానికి ఎలక్షన్ కోడ్ అంటూ అడ్డు చెప్పడం కార్మిక క్షేత్రంలో అశాంతిని నెలకొల్పడం అవుతుందని అన్నారు. సింగరేణిలోనే అత్యధిక ఉత్పత్తి ఉత్పాదనలతో ముందుకెళ్తున్న మణుగూరు ఏరియా ఇలాంటి సంఘటనల వలన వెనుకబడే ప్రమాదం ఉందని దానికి కార్మికులను బాధ్యులను చేయడం సరి కాదని అన్నారు. ఏరియాలో కొందరు అధికారులు నిబంధనలు పక్కకు పెట్టి ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారని వారి పద్ధతి మార్చుకోవాలని అన్నారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ బ్రాంచ్ సెక్రటరీ కామ్రేడ్ మేకల ఈశ్వరరావు జాయింట్ సెక్రటరీ కామ్రేడ్ జి పుల్లారావు, ఆఫీస్ బేరర్స్ నంబూరు శ్రీనివాసరావు, గోలి గంగాధర్ రావు, అబ్దుల్ సుభాని, ఆవుల నాగరాజు, ఆదర్ల సురేందర్, ఫిట్ సెక్రటరీలు గుండ్లపల్లి శరత్, దండు వీర విజయ్ కుమార్, గడ్డం సంతోష్ తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

## ద్విచక్రవాహనం, కారు ఢీ

### -ఇద్దరు మృతి



బూర్గంపాడు, మే 26 ప్రజాజ్యోతి

బంధువుల ఇంట్లో కర్మలకు వెళ్లి తిరిగి వస్తూ రోడ్డు ప్రమాదంలో ఒకరు మృత్యుఒడికి చేరగా మరొకరి పరిస్థితి విషమంగా మారిన సంఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలం పినపాక పట్టీనగర్ గ్రామంలోని కిన్నెరసాని బ్రిడ్జి వద్ద ఆదివారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. దీనికి సంబంధించి స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పాల్వంచ మండలం గుడిపాడుకు చెందిన శెట్టిపల్లి నర్సింహారావు(18) తన స్నేహితుడు కణితి హర్షవర్ధన్ తో కలిసి ద్విచక్రవాహనంపై బూర్గంపాడు వెళుతుండగా పినపాక పట్టీనగర్ లోని కిన్నెరసాని బ్రిడ్జికి చేరుకోగానే కారు ఢీకొట్టింది. ఈ సంఘటనలో ద్విచక్రవాహనం నడుపుతున్న శెట్టిపల్లి నర్సింహారావు అక్కడికక్కడే దుర్మరణం పాలవ్వగా స్నేహితుడు హర్షవర్ధన్ తీవ్రంగా గాయపడ్డాడు. ఈ సంఘటన సమాచారం అందుకున్న బూర్గంపాడు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతికి గల కారణాలను తెలుసుకున్నారు. తీవ్రంగా గాయపడిన హర్షవర్ధన్ను స్థానికుల సహాయంతో పాల్వంచ ఆసుపత్రికి తరలించగా ప్రథమ చికిత్స అనంతరం అక్కడి నుంచి కొత్తగూడెం ఆసుపత్రికి తరలించారు. అయితే చికిత్స పొందుతూ మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. ఈ మేరకు ఎస్సై సుమన్ కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# పేదల రాజ్యం కోసమే సీపీఎం పార్టీ పనిచేస్తుంది






మణుగూరు రూరల్, మే 26, ప్రజాజ్యోతి:

భారతదేశంలో సిపిఎం ఉంది త్యాగాల చరిత్ర అని కష్టాలను ఎదుర్కొన్న వాడే నిజమైన కమ్యూనిస్టు అని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు మచ్చ వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం మణుగూరు మండలం పగిడేరు పంచాయతీలో కుంజ కృష్ణకుమారి ప్రాంగణం లో సిపిఎం రాజకీయ శిక్షణ తరగతులు నిర్వహించారు. మండల కార్యదర్శి కొడిశాల రాములు ప్రిన్సిపాల్ గా వ్యవహరించారు. ఉపాధ్యాయులుగా మచ్చ వెంకటేశ్వర్లు సిపిఎం పార్టీ కార్యక్రమం విశిష్టత బోధించారు. దేశంలో మూడు రాష్ట్రాలలో 9 మంది ముఖ్యమంత్రులు పనిచేశారని పేదల సంక్షేమం కోసం సంక్షేమం కోసం తప్ప ఎవరి మీద ఎలాంటి మచ్చలేదని అన్నారు. ఈ దేశాన్ని అత్యధిక కాలం పాలించిన కాంగ్రెస్ పార్టీ స్వతంత్ర పోరాట ఫలితాలను ప్రజలకు అందించకుండా ప్రజలను దోపిడీ గురిచేసిందన్నారు. ఈ పది సంవత్సరాల కాలంలో బిజెపి కాంగ్రెస్ కన్నా అధికంగా దోపిడి చేసిందన్నారు. భారతదేశంలో త్యాగాల చరిత్ర సిపిఎం కున్నదన్నారు. బూర్జవా పార్టీలన్నీ కూడా ప్రజలను దోపిడీ చేయడం కోసమే పని చేసున్నారు. ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికల్లో పాల్గొంటూ ప్రజల పక్షాన పోరాటం చేస్తున్నామన్నారు. డబ్బులు పంచకుండా ఈ దేశంలో సిపిఎం నీ ఎదుర్కొనే శక్తి ఏ రాజకీయ పార్టీకి లేదన్నారు వీర తెలంగాణ విప్లవ పోరాటం మొదలుకొని దేశంలో ప్రజల పక్షాన అనేక త్యాగాల పోరాటాలు నిర్వహించిన చరిత్ర సిపిఎందని అన్నారు. డబ్బులు పంచకుండా ఏ పార్టీ కూడా ఎన్నికల్లో పోటీ చేయడం లేదు ప్రజలను మోసం చేస్తూ ఈ దేశ సంపదను రాజకీయ పార్టీలు కొల్లకోట్టి కార్పొరేట్ శక్తులకు దోచిపెడుతున్నాయన్నారు. స్వతంత్ర కాలం నుండి ఈనాటి వరకు దళితులు ఆదివాసులు ఇతర పేదల బతుకులు మారలేదన్నారు. ఖర్చు పెరిగింది, శ్రమ దోపిడీ పెరిగిందన్నారు. ప్రజల పోరాటాలు నిర్వహించడంలో కమ్యూనిస్టుల పార్టీల వెనుకబడ్డాయని విమర్శలు కొంతకాలం మాత్రమే ఉంటాయన్నారు మబ్బులు కమ్మిన సూర్యుడిలా ఈ దేశంలో కమ్యూనిస్టుల పోరాటాలు నిర్వహించబడతాయన్నారు. మధ్యాహ్నం క్లాసును ఉపాధ్యాయులుగా సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు రేపాకుల శ్రీనివాస్ పార్టీ నిర్మాణం పని పద్ధతి, మార్క్సిజం అధ్యయనం ఆవశ్యకత వివరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం సీనియర్ నాయకులు నెల్లూరి నాగేశ్వరరావు మండల కార్యదర్శి వర్గ సభ్యులు దామల్ల లెనిన్ బాబు, సత్రపల్లి సాంబశివరావు, ఉపతల నరసిం హా రావు, బొల్లం రాజు నందం ఈశ్వర రావు, పిట్టల నాగమణి, పల్లపు నాగే శ్వం రావు, శాఖా కార్యదర్శులు పర్షిక పాపారావు, తాళ్లపల్లి ఉప్పలయ్య, టేకుల సత్యవతి, గనబోయిన శంకర్, కుంజా రాజు, కుంజా యుగంధర్, భూషణంతోట పద్మ. గౌరీ పాల్గొన్నారు.

# తీన్మార్ మల్లన్న విజయాన్ని కాంక్షిస్తూ సీపీఐ ఓట్ల అభ్యర్థన

మణుగూరు రూరల్, మే 26, ప్రజాజ్యోతి

సిపిఐ, సిపిఎం, టిడిపి, టీజేఏసీ బలపరుస్తున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న విజయాన్ని కాంక్షిస్తూ పట్టభద్రులను మణుగూరులో సిపిఐ నాయకులు ఓటర్లను కలుస్తూ గెలిపించాలని అభ్యర్థిస్తున్నారు. ఆదివారం పినపాక నియోజకవర్గ కార్యదర్శి సరెడ్డీ పుల్లారెడ్డి, మండల కార్యదర్శి జంగశీమోహన్ రావు, పట్టణ కార్యదర్శి దుర్గాల సుధాకర్ తదితరులు ఓటర్లు కలుస్తూ ఓట్ల అభ్యర్థించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రశ్నించే గొంతుకను గెలిపించాలని, పట్టభద్రులు తమ హక్కుల సాధన కోసం ఉద్యమించి, గత ప్రభుత్వంపై అనేక కేసులు నిర్బంధాలు ఎదుర్కొన్నటువంటి వ్యక్తి తీన్మార్ మల్లన్న అని,అలాంటి వ్యక్తిని శాసనమండలిలో పంపించాల్సిన బాధ్యత మనందరి పైన ఉందని, విజ్ఞత గల, చదువుకున్నటువంటి మేధావులైన ప్రతి ఒక్కరు ఆలోచించి తమ ఓటు హక్కు



మొదటి ప్రాధాన్యత ఓటు తీన్మార్ మల్లన్నకు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని వారు విజ్ఞప్తి చేశారు.

# నకిలీ విత్తనాలపై అప్రమత్తంగా ఉండాలి

బూర్గంపహాడ్, మే 26, ప్రజాజ్యోతి

నకిలీ విత్తనాలపై అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయ శాఖ ఏడిఏ తాతారావు, మండల వ్యవసాయ శాఖ అధికారి ఆర్ శంకర్ అన్నారు. సోంపల్లి రెవిన్యూ పరిధిలోని రైతులకు వివిధ అంశాలపై ఆదివారం అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈకార్యక్రమంలో ఏడిఏ తాతారావు పాల్గొని మాట్లాడుతూ రైతులందరూ నకిలీ విత్తనాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గ్రామాలలో ఇంటింటికి తిరిగి ఎవరైనా గుడ్డ సంచులలో , నకిలీ లేబుల ఉన్న ప్యాకెట్లలో విత్తనాలు అమ్మినట్లయితే ఎట్టి పరిస్థితులోనూ అటువంటి వారి వద్ద విత్తనాలు తీసుకోవద్దని, లైసెన్స్ కలిగిన అధికృత డీలర్ నుంచి మాత్రమే విత్తనాలను తీసుకోవాలని సూచించారు. పంట కాలం పూర్తయ్యే వరకు బిల్లును జాగ్రత్తపరచుకోవాలని తెలిపారు. అనంతరం మండల వ్యవసాయ శాఖ అధికారి ఆర్ శంకర్ మాట్లాడుతూ గ్రామాలలో ఎవరైనా అనుమతి లేకుండా విత్తనాలు అమ్ముతున్నట్లు సమాచారం



తెలిస్తే వెంటనే తమకు తెలియజేయాలని కోరారు. వేసవిలో లోతు దుక్కులు చేయడం వలన భూమి లోపల పొరల్లో ఉన్న పురుగుల యొక్క గుడ్లు లార్వాలను నశింపచేయొచ్చని తెలిపారు. అదే విధంగా జనుము, జీలుగా, పిల్లి పెసర వంటి పచ్చిరొట్ట పైర్ల వల్ల కలిగే ఉపయోగాలను రైతులకు వివరించారు. మట్టి పరీక్ష నమూనాలను ఏ విధంగా సేకరించాలని, మట్టి పరీక్ష ఫలితాల విశ్లేషణ గురించి తెలియజేశారు. అదే విధంగా వరి పంట అవశేషాలను తగలబెట్టడం ద్వారా జరిగే అనర్థాలను గురించి రైతులకు వివరించారు. అనంతరం మండలంలోని లక్ష్మీ పురం, సారపాక, బూర్గంపాడులో గల విత్తనాల షాప్లను తనిఖీ చేశారు. ఈసందర్భంగా వారితో మాట్లాడుతూ రైతులకు విత్తనాలు, ఎరువులు అమ్మినట్లయితే వారికి బిల్లులను ఇవ్వాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి ప్రసాద్, రైతులు గాదె నర్సిరెడ్డి, దనుగూరి నాగేశ్వరరావు, బోరెం శ్రీనివాసరావు, చలకంటి సత్యం, పండగ చిట్టెయ్య, తదితరులు పాల్గొన్నారు.

# గోత్ర, ప్రవర వివాదం మళ్లీ తెరపైకి

**- భద్రాద్రిలో పుష్కరకాలంగా కొనసాగుతున్న వైనం**
**- తాజాగా ఐదుగురు సభ్యులతో కమిటీ**
**- వైదికబృందం నుంచి నివేదిక కోరిన దేవాదాయశాఖ కమిషనర్**
**- వెంటనే వివరణ ఇవ్వాలని వేదిక బృందానికి ఈవో ఆదేశం**



భద్రాచలం,మే 26,ప్రజాజ్యోతి

దక్షిణ అయోధ్యగా విరాజిల్లుతున్న భద్రాచల పుణ్యక్షేత్రంలో సీతా రాముల గోత్ర ప్రవరలపై తలెత్తిన వివాదం మరోసారి తెర పైకి వచ్చింది. ఇటీవల హైకోర్టు ఆదేశానుసారం రాష్ట్ర ప్రభుత్వం ఐదుగురు సభ్యుల నిపుణుల కమిటీని గోత్ర ప్రవరల అంశం గురించి నియమించింది. దాంతో ఈ కమిటీ దేవస్థానానికి సంబంధించిన కల్యాణోత్సవంలో పఠించే గోత్రప్రవరలతో కూడిన పూర్తి నివేదికను సమర్పించాలని ఇప్పటికే ఆదేశించింది. ఈ క్రమంలో ఇటీవల కమిటీ సమావేశం జరిగే రోజున కమిటీలోని ఒక సభ్యుడినిభద్రాద్రి దేవస్థానంలో కీలక వైదిక సిబ్బంది నలుగురు ఆహ్వానించినట్లు హైదరాబాద్ కు చెందిన ఓ వ్యక్తి దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖకు ఫిర్యాదు చేశారు. దీంతో దేవస్థానం లో కీలకంగా వ్యవహరించే ఆ నలుగురు వైదిక సిబ్బందికి వివరణ ఇవ్వాలని ఇప్పటికే దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి మెమో జారీ చేశారు. తాజాగా సీతారాముల గోత్ర ప్రవరల విషయంలో వైదిక సిబ్బంది నుంచి సంతకాలతో కూడిన లిఖితపూర్వకంగా ఆధారాలతో 28లోపు సేకరించి నివేదికను పంపాలని దేవస్థానం ఈవోను దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు ఆదేశించారు. ఈ నేపథ్యంలో ఆదివారం సాయంత్రం లోపు ఇందుకు సంబందించి వైదిక సిబ్బం ది సంతకాలతో కూడిన వివరణను తనకు సీల్డ్ కవర్లో అందజేయాలని శనివారం ఈవో ఉత్తర్వులు జారీ చేశారు. స్థానాచార్యులు, ప్రధాన అర్చకులు, ఉప ప్రధాన అర్చకులు, ముఖ్య అర్చకులు, అర్చకులు, వేద పండితులు శ్రీమద్రామాయణ పారాయణదారులు మొత్తం 30మందిని ఈ విషయంలో సీతారాముల గోత్ర ప్రవరలపై వివరణ ఇవ్వాలని కోరినట్లు తెలిసింది.

**పుష్కరకాలంగా వివాదం...**

భద్రాద్రిలో సీతారాముల కల్యాణ సమయంలో గోత్ర ప్రవరల విషయంలో ఈ వివాదం గత పుష్కరకాలంగా సాగుతోంది. ఈ విష యంపై పలువురు రామభక్తులు, దేవస్థానంలోని వైదిక బృందం సభ్యులు పరస్పరం విమర్శలు, ప్రతివిమర్శలు చేసుకున్న సంద ర్భాలున్నాయి. ఈ క్రమంలో ఈ అంశంపై గత దశాబ్దకాలంగా గవర్నర్, సీఎం, ప్రభుత్వ ఉన్నతాధికారు లకు ఎవరి వాదనలు వారు నివేదికల రూపంలో అందజేశారు. ఈ క్రమంలోనే తాజాగా ఈ అంశం న్యాయస్థానం పరిధిలోకి వెళ్లడం, సీతారాముల గోత్ర ప్రవరలపై నిపుణుల కమిటీతో నివేదికను కోరడంతో ప్రభుత్వం ఈ అంశంపై పూర్తి వివరాలు సేకరిస్తోంది. తాజా పరిణామాలతో మళ్లీ రామనారాయణ అంశంపై తెరపైకి వచ్చింది.

## పోలీస్ కేంద్రాలను సందర్శించిన కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రెహమాన్



జూలూరుపాడు, మే 26, ప్రజాజ్యోతి

జూలూరుపాడు మండల కేంద్రంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు పోలింగ్ కేంద్రాలను కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రెహమాన్ ఆదివారం సందర్శించారు. ఆయన మాట్లాడుతూ పౌరులు ఓటర్లు ఎన్ని కల నిబంధనలు పాటించాలని, ఓటరు గుర్తింపు కార్డు వెంట తెచ్చుకోవాలని , క్యూలైన్లో నిల్చోని ఓటు వేయాలని ఎన్నికల సిబ్బందికి ప్రతివారు సహకరించాలని, ఎవరు తగాదాలు పెట్టుకోవద్దని , ప్రచారం నిర్వహించవద్దని, సెల్ ఫోన్స్ ఎలక్ట్రికల్ పరికరాలు పోలింగ్ బూత్ లోకి అనుమతి లేదని అన్నారు, 144 సెక్షన్ అమల్లో ఉన్నది కావున 5 గురు మించి గుంపులుగా చేరవద్దని పోలింగ్ బూతు వద్ద వంద మీటర్ల పరిధిలో ఆంక్షలు ఉంటాయని ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఓటు వేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జూలూరుపాడు ఎస్ఐ ఇరుగు జీవన్ రాజు , పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నిషేధిత గంజాయి పట్టివేత




టేకులపల్లి, మే 26, ప్రజాజ్యోతి:

మండలంలోని గోలియాతండ, సేవాలాల్ దేవాలయం సమీపంలో ఆదివారం వాహనాలను తనిఖీ చేస్తుండగా బెలినో కార్ నెంబర్ టీ ఎస్ 27 జీ 5510లో 4 కిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పట్టుకున్న గంజాయి విలువ సుమారుగా రూ. లక్ష ఉంటుందని తెలిపారు. తురుగొండ కార్తీక్, బిగుల్లా వంశీ కృష్ణ అనే ఇరువురు డొంకరాయి నుంచి కొత్తగూడెం మీదుగా జనగాం వెళ్తున్నారన్నారు. కేసు నమోదు చేసి ధర్యప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# వైద్యసిబ్బంది సలహాలు పాటించి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి

*: ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ప్రతీక్ జైన్*

భద్రాచలం,మే 25,ప్రజాజ్యోతి

ఆదివాసి గిరిజన గ్రామాల్లో వైద్య సిబ్బంది ఇంటింటికి సందర్శించి గిరిజన ప్రజలకు ఇచ్చే సల హాలు, సూచనలు పాటించి తమ ఆరోగ్యాన్ని కాపా డుకోవాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ప్రతిక్ జైన్ ఆదివారం నాడు ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివాసి గిరిజన కుటుంబాలలో ఉన్న పెద్ద వయసు నుంచి చిన్న పిల్లల వరకు ఎవరికైనా షుగరు, బీపీ ఉన్నట్లయితే ఆశ వర్కర్, ఏఎన్ఎం సహాయంతో వారి పేర్లు నమోదు చేయించుకుని ప్రభుత్వం ద్వారా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ఇచ్చు మం దులను క్రమం తప్పకుండా వేసుకోవాలని అన్నారు. జ్వరం వచ్చినట్లయితే వైద్య సిబ్బంది వద్ద రక్త పరీక్ష చేయించుకుని వైద్యుల సలహా మేరకు మలేరియా ఇతరత్రా జబ్బులకు ప్రభుత్వం అందించు మందులను తప్పనిసరిగా వేసుకోవాలని,వైద్య సిబ్బంది ద్వారా దీర్ఘకాలిక వ్యాధులైన క్యాన్సర్ మిగతా జబ్బుల కోసం ఈ సంజీవని ద్వారా స్పెషలిస్ట్ డాక్టర్ల సలహా మేరకు మందులు వాడాలని అన్నారు.గ్రామాల్లోని గిరిజన



గ్రామాలలో గిరిజన కుటుంబాలలోని సభ్యులకు నాలుగు వారాలకు మించి దగ్గు, బరువు తగ్గడం ఛాతిలో నొప్పి, తరచుగా జ్వరం వస్తున్నట్లయితే కళ్లపరీక్ష చేసి క్షయ అని నిర్ధారణ అయితే ప్రభుత్వం అందించే పూర్తి చికిత్స పొందాలని,మరల కల్ల పరీక్ష చేసి క్షయ వ్యాధిలేదని నిర్ధారణ అయినట్లయితే ఆపివేయలని, చిన్నపిల్లలకు క్షయ లక్షణాలున్న వైద్యులకు సంప్రదించి మందులు వాడవలెనని,ప్రజలకు ఒంటిపై రాగి రంగు మచ్చలు ఉన్నట్లయితే వైద్యులకు సంప్రదించి లెప్రసి నిర్ధారణ అయితే ప్రభుత్వం అందించే ఉచిత మందులు తప్పనిసరిగా వాడి వ్యాధిని నిర్మూలించుకోవాలని ఆయన అన్నారు.

## ఎన్నిక ఏదైనా గెలుపు కాంగ్రెస్‌దే

**- యువజన కాంగ్రెస్ నాయకులు చింతిరాల అరుణ్**

భద్రాచలం,మే 26,ప్రజాజ్యోతి



రేపు జరగబోయే వరంగల్, ఖమ్మం, నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్నని అఖండమేజరిటీతో గెలి పిద్దాం, పోయినసారి పట్టభద్రుల ఎన్నికల్లో మల్లన్న ఒంటరిగా పోటీ చేసి ఒక లక్ష అరవై వేల పై చిలుక ఓట్లు సంపాదించి బిఆర్ఎస్ అభ్యర్థి ని గడగడ లాడిం చాడు, ఇప్పుడు మన కాంగ్రెస్ పార్టీ కుటుంభం అండగా ఉంది అందరం కలిసి ఆకాండ మెజారిటీ అందిద్దాం. ఉద్యోగ, ఉపాధ్యాయ, విద్యార్థి, నిరుద్యోగ, సమస్యల పరిష్కరానికి నిరంతరం పట్టువదలని విక్రమార్కుడు తీన్మార్ మల్లన్న, సాధారణ కుటుంబంలో పుట్టి స్వయం కృషితో ఎదిగి తన కంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని సుస్థిరం చేసుకున్న పట్టబద్రుడు, ఉద్యోగ భద్రత విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న ఎంప్లాయి ఫ్రెండ్లీ విధానం దేశానికే గర్వకారణం.సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభు త్వంలో రైతును రాజు చేయటామే ద్యేయంగా అనేక విప్లవాత్మక కార్యక్ర మాలకు శ్రీకారం చుట్టింది కాంగ్రెస్ ప్రభుత్వం.ఇప్పటికే దేశంలో ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా కాంగ్రెస్ ప్రభుత్వం నిలుస్తుంది. నియోజకవర్గ పట్ట భద్రులు,మేధావులు ఈ నేల 27తేదిన జరిగే పట్టభద్రుల ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్న గారికి బ్యాలెట్ నంబర్ 2 లో మొదటి ప్రాధాన్య ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలి కాంగ్రెస్ ప్రభుత్వ అభివృద్ధి లో పాలు పాలుపంచుకోవాలి కోరుతున్నాము.

## వర్స వారి పంచకట్టు వేడుకలో పాల్గొన్న ఎమ్మెల్యే



భద్రాచలం,మే 25,ప్రజాజ్యోతి

ఈరోజు భద్రాచలం రాజుపేట కాలనీ లో వర్స వసంతరావు - లత గారి కుమారుల పంచకట్టు వేడుకలో పాల్గొన్న భద్రాచలం శాసనసభ్యులు డాక్టర్ తెల్లం వెంకట్రావు మరియు ఎండి నవాబ్,మండల కార్యదర్శి దొడ్డిపట్ల కోటేష్,పోతిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పట్టభద్రుల పోలింగ్ కు సర్వం సిద్ధం

టేకులపల్లి, మే27,ప్రజాజ్యోతి:



మండలంలో పట్టభద్రుల పోలింగ్ కు సర్వం సిద్ధం చేసినట్లు తహశీల్దార్ నాగభవాని అన్నారు. ఆదివారం టేకులపల్లి తహశీల్దార్ కార్యాలయంలో ఎమ్మార్వో మాట్లాడుతూ పట్టభద్రుల ఎన్నికలలో టేకులపల్లి మండలంలో మొత్తం 2031 మంది ఓటర్లు ఉన్నారనన్నారు. పురుషులు 1251 మంది, మహిళలు 780 ఉన్నారని తెలిపారు. మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పిఎస్ నెం 251 పోలింగ్ బూత్ లో 1059 మంది, పిఎస్ నెం 252 పోలింగ్ బూత్ లో 972 మంది ఓటు హక్కును వినియోగించుకుంటారని పేర్కొన్నారు. ఎన్నికల్లో మండల పట్టభద్రులు అందరూ స్వచ్ఛందంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు.

## విద్యుత్ ఘాతంతో గేదె మృతి

బూర్గంపహాడ్, మే 26, ప్రజాజ్యోతి

సోంపల్లి గ్రామానికి చెందిన నడిపింటి రమేష్ అనే రైతుకు చెందిన గేదె విద్యుత్ ఘాతంతో మృతి చెందింది. నిరుపేద కుటుంబానికి చెందిన రమేష్ గేదె మృతి చెందడంతో కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతమయ్యారు. గ్రామానికి సమీపంలో మేతకు శనివారం ఉదయం వెళ్లిన గేదె ఇంటింటికి తిరిగి రాకపోడంతో గ్రామంలో వెతికాడు. తారస పడకపోవడంతో మరుసటి రోజు ఆదివారం వెతుకుతుండగా ఓ రైతు పొలం సమీపంలోని ట్రాన్స్ఫా ర్మర్ కింద విద్యుత్ ఘాతంతో మృతి చెందింది. సుమారు గేదె విలువ రూ 60వేలు ఉంటుందని రైతు తెలుపు తున్నారు. తనను ప్రభుత్వం ఆదుకో వాలని కోరారు. గేదె మృతి విషయంపై విద్యుత్ శాఖ అధికారులు పరిశీలించారు.

